



అంతర్వేది పల్లిపాలెం తుఫాన్ షెల్టర్‌లో ఉన్న బాధితులు



ఆయుధాలివిగో..

» అమలాపురం ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'
» విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు 6



గన్‌తో ఎస్పీ రాహుల్ మీనా

పోలీసు జాగిలం నుంచి షేక్‌హ్యాండ్ తీసుకుంటున్న ఎస్పీ రాహుల్ మీనా

పడిపోయిన ఇళ్ల సర్వే

» బాధితుల వివరాలను సేకరిస్తున్న వీఆర్వోలు

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లు పడిపోయి నష్టపోయిన బాధితుల వివరాలను ఆయా గ్రామాల వీఆర్వోలు సర్వే చేస్తున్నట్టు తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అంతర్వేది పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి తదితర ప్రాంతాల్లో నష్టపోయిన వారినుంచి పత్రాలు శరవేగంగా సేకరిస్తున్నారు. పునరవాస కేంద్రాలకు తరలివెళ్లిన వారికి ప్రభుత్వం కుటుంబంలో ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున రూ.3వేలు, ఒకరు లేదా ఇద్దరు వెళ్లినవారికి రూ.వెయ్యి చొప్పున, నలుగురు లేదా ఐదుగురు వెళ్లిన వారి కుటుంబంలో ముగ్గురికి మాత్రమే రూ.3వేలు ప్రభుత్వం అందిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఆ రెండు పునారావాస కేంద్రాల వద్ద ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వం ఈ నగదు పంపిణీ చేస్తుందన్నారు. మత్స్యకార కుటుంబాలకు 50కిలోల బియ్యం, ఇతరులకు 25కిలోల బియ్యం, మంచినూనె, కందిపప్పు, ఉల్లి, రేషన్, ఆధార్‌కార్డుల ప్రకారం కూటమి ప్రభుత్వం అందివ్వడానికి సర్వేచేసి పత్రాలు సేకరణ జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు.



అంతర్వేదిలో తుఫాన్ ప్రభావంతో వర్షపునీటిలో మునిగిన ఇళ్లు

చివరికిలా : కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో నీట మునిగిన వరిచేను

మొంథా వర్రీయే!



తుఫాన్ మిగిల్చిన క(న)ష్టం..

పెదపూడిలో మొలకలు వచ్చిన వరిపనలు పరిశీలిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచేసింది.. వరి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. తుఫానుకు ముందు రెండు రోజులు అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు చేలల్లో నీరు చేరి పంట దెబ్బతినగా తీవ్ర తుఫాన్‌తో మరింత నష్టపోయింది. రోజుల తరబడి నీళ్లల్లో పంట నానిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.326 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. నష్టం లెక్కింపు కొన సాగుతుండడంతో పెరిగే అవకాశం ఉంది. వరి, ఉద్యాన వన పంటలతో పాటు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల పొలాలు మునకలో ఉండడంతో యాప్ ద్వారా అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నష్టాల అంచనాలు తేల్చే పనిలో పడ్డాయి.

» లక్షలాది ఎకరాల్లో మునిగిన పంట
» లబోదిబోమంటున్న అన్నదాత
» జిల్లాల వారీగా బృందాల ఏర్పాటు
» నష్టం అంచనాల్లో అధికారులు
» వారం రోజుల్లో పూర్తి నివేదిక
» అల్పపీడనంతో అక్కడక్కడా వానలు

కోనసీమలో రూ.148 కోట్లు

మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 78 వేల ఎకరాల్లో రూ.148 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. 22 మండలాలు, మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీ పరిధిలో జరిగిన పంట నష్టాలు నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా యంత్రాంగాన్ని గురువారం ఆదేశించారు. నష్టాల అంచనాలో అధికార బృందాలు నిమగ్నమ య్యాయి. ఒకట్రెండురోజుల్లో తుఫాన్ నష్టాలను రూపొందించిన కలెక్టర్‌కు నివేదించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రాథమికంగా 31 వేల ఎకరాలకుపైబడి వరి పంట దెబ్బతిన్నట్టు, మిగిలిన చోట్ల నీటమునిగినట్టు భావిస్తున్నారు. పత్యేక బృందాలను నియమించి నష్టాలను అంచనా వేస్తున్నారు. కౌలు రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో 300 విద్యుత్ స్తంభాలతోపాటు 125 కిలోమీటర్ల పరిధిలో చెట్లు, వివిధ రకాల వృక్షాలు కుప్పకూలాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని నివేదించారు.జిల్లాలో 47 పాఠశాలల్లో డ్యామేజీలు అయినట్టు విద్యాశాఖ అంచనాలు రూపొందించాయి. ఐదు రోజుల్లో నివేదికలు రూపకల్పనలు చేసి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

కాకినాడలో రూ.98 కోట్లు

మొంథా తుఫాన్ జిల్లాలో అన్నదాతను నిలువునా ముంచేసింది. భారీ ఈదురుగాలులు, కుండపోత వానతో వరి వెన్నువిరిచింది. మరికొద్ది వారాల్లో చేతికి రానున్న పంటను చిదిమేసింది.దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు లబోదిబోమంటు న్నారు. తుఫాన్ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతుండడంతో గురువారం పలు చోట్ల ఏకధాటిగా కుండపోతగా వాన కురిసింది. ఎగువన భారీ వర్షాలతో ఒక వైపు గోదావరి.. మరో వైపు ఏలేరుకు వరద ముప్పు పెరుగుతోంది. మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటడంతో వ్యవసాయశాఖ బుధవారం కాకినాడ జిల్లా వ్యాప్తంగా 368 గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేయగా గురువారం నాటికి ప్రాథమికంగా 50,700 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించారు.ఈ నష్టం విలువ రూ.98 కోట్ల వరకు అంచనా. మొత్తం జిల్లాలో 261 గ్రామాల్లో నష్టం జరగ్గా పంట నష్టపోయిన అన్నదాతలు 33,596 మందిగా గుర్తించారు.ఇది పెరగనుంది. పంట నష్టం అంచనాలు పూర్తయ్యే సరికి వారం పట్టనుంది. అత్యధికంగా పెదపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరి దెబ్బతింది. ధాన్యం తడిచి మొలకలు వచ్చేశాయి. గురువారం పర్యటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నష్టం తీవ్రతను మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్‌లో వివరించారు. మొక్కజొన్న 200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాల్లో నష్టపోయింది.



గోకవరంలో పొలాల పరిశీలనకు కాలినడకన కలెక్టర్ కీర్తి

'తూర్పు'న రూ.80 కోట్లు

మొంథా కష్టమొచ్చింది..భారీ నష్టాన్ని మిగిల్చింది.. తుఫాన్ ప్రభావం కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షాలకు జనజీవనం అస్త వ్యస్తమైంది. జిల్లాలో వివిధ శాఖలకు సంబం ధించి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.107 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.అధికారులు క్షేత్రస్థాయిలో అంచనాల్లో నిమగ్నమయ్యారు.జిల్లాలో 209 గ్రామాలపై తుఫాన్ ప్రభావం చూపినట్టు అంచనా వేశారు. 10,626 మంది నష్టపోయారు. వ్యవసాయరంగంలో 2115 హెక్టార్ల పంటపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 581.4 హెక్టార్లలో నష్టం జరి గింది. జిల్లాలో 56 గృహాలు దెబ్బతిన్నాయి. 68 రిలీఫ్ సెంటర్లు ఏర్పాటు చేసి, 2718 మందికి పునరావాసం కల్పించారు. 18,872 మందికి ఆహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. జిల్లాలో 87.99 కిలోమీటర్ల మేర 48 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిని రూ.54.57 కోట్ల నష్టం వాటిల్లింది. పంచాయతీ రాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతినగా రూ.45.81 కోట్లు నష్టం వాటిల్లింది.మైనర్ ఇరిగేషన్ వనరులు 21 దెబ్బతినగా రూ.6.87 కోట్లు నష్టం జరిగింది. 123 వాటర్ ట్యాంక్‌లు డ్యామేజీ అయ్యాయి.జిల్లాలో 429 హెల్త్ సబ్-సెంటర్లు ఉన్నాయి. 251 మెడి కల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖకు రూ.37.34 లక్షలు నష్టం వచ్చినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

తుఫాన్ బాధితులకు సాయమిలా..

తుఫాన్ వల్ల పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలతో పాటు కుటుంబానికి రూ.3 వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.వెయ్యి వంతున పరిహారం అందించడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. కాకినాడ తీరప్రాంతంలో ఉన్న 45 గ్రామాల్లో 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. చేనేత కార్మికులకు బియ్యాన్ని అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వీటిని ప్రారంభించి మూడురోజుల్లోగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుని ఇళ్లకు వెళ్లేవారికి ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంట నూనె, పంచదారతోపాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ 50 శాతం రాయితీపై దాణాను పంపిణీకి సిద్ధం చేసింది.



పైడికొండల రాజేశ్వరి



జ్ఞానపూర్ణదేవిదీక్షిత



రాచకొండ సూర్యప్రణవి



ఎంహెచ్ఎస్వీ అనూష

విద్యార్థినులకు అరుదైన అవకాశం

» స్పేస్ వీక్-సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు నలుగురి ఎంపిక

అమలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్పేస్ వీక్-సైన్స్ ఎక్స్‌పోజర్ అండ్ ఎడ్యుకేషనల్ టూర్ టూ ఢిల్లీ కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లానుంచి ఇద్దరేసి విద్యార్థులు మాత్రమే ఎంపికయ్యే ఈ కార్యక్రమానికి జిల్లానుంచి నలుగురు ఎంపిక కావడం అత్యంత గర్వకారణమని, రాష్ట్రంలోనే ఈ ఏ ఇతర జిల్లాకు లభించని అరుదైన గౌరవం కోనసీమ జిల్లాకు లభించిందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పైడికొండల రాజేశ్వరి, కె.జ్ఞానపూర్ణాదేవిదీక్షిత, అమలాపురం మహాత్మాగాంధీమున్సిపల్‌హైస్కూలుకు చెందిన రాచకొండ సంజనానాగసూర్యప్రణవి,అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన ఎంహెచ్ఎస్వీ అనూష ఢిల్లీ టూర్‌కు ఎంపికయ్యారు. నవంబరు 6నుంచి 8వరకు ఢిల్లీలో జరిగే సైన్స్‌ఎక్స్‌పోజర్‌టూర్‌లో వీరు పాల్గొంటారు. వీరిని విద్యాశాఖ అధికారితోపాటు పలువురు అభినందించారు.



పోటీలకు ఎంపికైన జొన్నాడ విద్యార్థులు

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు విద్యార్థినులు

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కె.సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో అండర్-9 21 కిలోల విభాగంలో మారిశెట్టి స్నేహ ఉష సిల్వర్‌మెడల్, అండర్-11 32కిలోల విభాగంలో కర్రి బాశ్రీనందిని బ్రాంజ్ మెడల్, అండర్-14 50కిలోల విభాగంలో నిట్టూరి హర్షిత గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. వీరిని కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, కోచ్‌లు సత్తిబాబు, సూర్యతేజరెడ్డి, నానిబాబు, శివ సురేష్ అభినందించారు.

సీఎం ఆదేశాల అమలుకు కలెక్టర్‌ను కలిసి మాట్లాడదాం

» కోనసీమ రైతు పరిరక్షణ సమితి సమావేశంలో తీర్మానం
» నీట మునిగిన వరిచేలు పరిశీలన



గొల్లవిల్లిలో నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న కోనసీమ పరిరక్షణ సమితి నాయకులు

ఉప్పలగుప్తం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ముంపు సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆదేశించిన విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి మాట్లాడేందుకు కోనసీమ పరిరక్షణ సమితి సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం అధ్యక్షతన గొల్లవిల్లిలో రైతు నాయకుడు అడబాల సత్యనారాయణ ఇంటి వద్ద గురువారం రైతు సమావేశం జరిగింది. అల్లవరం మండలంలో బుధవారం సీఎంను కలిసిన రైతు పరిరక్షణ సమితి జిల్లాలో ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని కోరింది. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటేనే కోనసీమలో వ్యవసాయం సాగుతుందని విన్నవించింది. తాత్కాలిక పరిష్కారాలతో సమస్య మరింత జఠిలమవుతున్నట్టు రైతు నాయకులు సీఎంకు వివరించారు. దీనికి ఆయన స్పందించి ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, డ్రైనేజీశాఖలతోపాటు రైతు సంఘాలు, నీటి సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిపి చర్చల ద్వారా పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సమస్య తక్షణ పరిష్కారానికి రైతు నాయకులు కలెక్టర్‌ను కలిసి సీఎం ఆదేశాలను అమలు చేయాలని కోరేందుకు సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఆయన్ను కలిసేందుకు తేదీ నిర్ణయించామని నాయకులు తెలిపారు. తొలుత రైతు సంఘం ఆధ్వర్యంలో గొల్లవిల్లిలో నీట మునిగిన సార్వా చేలను పరిశీలించారు. జరిగిన నష్టానికి తగు పరిహారం రైతులకు అందేలా అధికారులను కోరతామన్నారు. సమావేశంలో రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి, అగ్రిమిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, అరిగెల నానాజీ, చిక్కం పెద్దబ్బులు, అడబాల సత్యనారాయణ, నల్లా సత్యనారాయణ, గుత్తుల నాగరాజు, యెరుబండి రాంబాబు, మంచెం బుజ్జి, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, మంచెం బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలబాలాజీ సన్నిధిలో మాసకల్యాణం



అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మాసకల్యాణంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మాస కల్యాణాన్ని అర్చకులు గురువారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ బాలబాలాజీస్వామి తరఫున అర్చకులు శ్రీదేవి, భూదేవి మెడలో మాంగళ్యధారణ చేశారు. భక్తుల గోవిందనామస్మరణలు చేస్తుండగా వధువుల శిరస్సులపై శాస్త్రోక్తంగా జీలకర్ర, బెల్లం పెట్టి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో కల్యాణం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో కర్తలుగా పాల్గొన్నారు. అర్చకులు భక్తులకు వేదాశ్వీచనం అందించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ర్యాలిలో ఘనంగా స్వామివారి కల్యాణం





ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం.. తిలకిస్తున్న భక్తజనం

ఆత్రేయపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో కార్తీక గురువారం స్వామివారి శ్రవణనక్షత్ర మాసకల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. కల్యాణం శోభాయమానంగా జరిపారు. ఈవో రమణమూర్తి ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధి.. సంక్షేమ పథకాల పర్యవేక్షణకు

మూడంచెల వ్యవస్థ



» మండల పరిషత్ కార్యాలయాల్లో సచివాలయ విభాగం ఏర్పాటు

అమలాపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు మూడంచెల సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు రాష్ట్రస్థాయితోపాటు జిల్లాస్థాయికి మాత్రమే పరిమితమైన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మండలస్థాయికి విస్తరించారు. ఈ మేరకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతోపాటు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి అర్హులైన ప్రతిఒక్కరికీ అందించేలా మండలస్థాయి వ్యవస్థను పర్యవేక్షక సంస్థగా ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్నిమండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో జీఎస్‌డబ్ల్యుఎస్ విభాగాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

మండలస్థాయికి అధికారుల నియామకం

రాష్ట్రస్థాయితోపాటు జిల్లాస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాలు ఉన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని గతంలోనే ఏర్పాటు చేశారు. జిల్లా కార్యాలయంలోజీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారితోపాటు పరిపాలనాధికారి, సీనియర్ అసిస్టెంట్, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టెక్నికల్ కేడర్ సిబ్బందిని నియమించారు. మండలస్థాయి, పురపాలక సంఘాల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలు, మున్సిపల్ మేనేజర్లను ఆయా విభాగాలకు జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులుగా నియమించారు. ఇప్పటికే జిల్లాలో పదిమందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించాయి. వారంతా జీఎస్‌డబ్ల్యుఎస్ మండలస్థాయి అధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాలోని 22 మండలాలతోపాటు అమలాపురం, మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘాలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయతీ జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని జీఎస్‌డబ్ల్యుఎస్ విభాగాలకు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక ఫంక్షనరీ అసిస్టెంట్‌ను నియమించారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసేందుకు ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పగించారు. ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తోపాటు ఫర్నీచర్, ఇతర సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యతను వారికి అప్పగించారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆయుధాలివిగో...



- అమలాపురం ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'
- విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు
- ఆయుధాలు, డాగ్ స్క్వాడ్‌లతో డెమో ఇచ్చిన ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులను దగ్గరకు చేయాలనే సంకల్పంతో విద్యార్థి దశ నుంచే పోలీసుల విధి నిర్వహణపై అవగాహన కల్పించే లక్ష్యంతో 'ఓపెన్ హౌస్' నిర్వహిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. అమలాపురంలోని కోనసీమ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లోభాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రాహుల్ మీనా పాఠశాల్లోని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పోలీసు విధి నిర్వహణలో ఉపయోగించే డ్రోన్ పరికరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఇంటికి రక్షణ కల్పించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం కారణంగా జరిగిన ప్రమాదాల్లో 19 మంది మరణించారన్నారు. సమాజంలో 99.09 శాతం మిగిలిన ఒక్క శాతం జనాభాలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆధునిక పరికరాలు, వివిధ ఆయుధాలైన ఎస్ఎల్ఆర్, ఏకే 47, ఎంపీ5కే, టియర్ గ్యాస్ గన్స్, వీపీ జాకెట్ల పనితీరును ఆర్మ్‌డ్ రిజర్వు విధులను వివరించారు. సాంకేతిక ప్రదర్శన, క్లూస్‌టీమ్, కమ్యూనికేషన్ వ్యవస్థ, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ వంటి కీలక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, నేరస్తులను గుర్తించే విధానాన్ని డెమో చేసి ఎస్పీ సమక్షంలో చూపించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అటువంటి నేరాలకు గురైతే 1930కు కాల్‌చేసి జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకతాయిల బారి నుంచి రక్షణ కోసం 112కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అడ్మిన్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం డీఎస్పీ ప్రసాద్, ఎస్‌టీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఏఆర్ ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, దిలీప్, అనేక మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఆయుధాలను తిలకిస్తున్న విద్యార్థులు

కరాటే, బాడీబిల్డింగ్, కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ... ఈ క్రీడాంశాల్లో అతడికి అతడే సాటి... పోటీ ఎక్కడైనా పతకం అతడిదే.... గ్రామీణ ప్రాంతంలో పుట్టిన ఈ యువకుడు మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్. అతడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గుత్తాల రారాజు. క్రీడలు, వ్యాయామంపై ఉన్న ఆసక్తే అతడిని ఈ స్థాయికి తీసుకెళ్లింది.



మార్షల్ ఆర్ట్స్‌లో రారాజు



- నిరంతర సాధనతో సత్తాచాటుతున్న లంకాఫ్ ఠాణేలంక యువకుడు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 14 పతకాలు కైవసం
- విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)



స్వీయ రక్షణపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రారాజు

మారుమూల లంక గ్రామమమైన లంకాఫ్ ఠాణేలంకలో వ్యవసాయ కుటుంబానికి చెందిన గుత్తాల లక్ష్మీనారాయణ-పల్లాలమ్మ దంపతుల నాలుగో మగ సంతానం రారాజు. తండ్రి ఇటీవలే మృతి చెందాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న రారాజుకు కరాటేపై మక్కువ. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కరాటేలో సాధన చేస్తున్న యువకులను చూసి దానిపై ఆసక్తి పెంచుకున్నాడు. తొలుత రాజుపాలేనికి చెందిన వీవీఎస్ వర్మ, పల్లిపాలేనికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాస్, అయినాపురానికి చెందిన చిక్కాల పనసయ్య వద్ద శిక్షణ పొందాడు.మెళకువలు తెలుసుకుని బంగారు, రజత పతకాలు సాధించాడు. బాడీబిల్డింగ్‌లో చాంపియన్‌గా నిలిచి రజత పతకాలు గెల్చుకున్నాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. కిక్ బాక్సింగ్‌లో బ్లాక్ బెల్ట్ పొంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశం వచ్చినా వదిలి తాను నేర్చుకున్న విద్యను పలువురికి అందించాలని 2019లో ముమ్మిడివరంలో రారాజు జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించాడు. జిల్లాలో వందలాది మందికి శిక్షణ ఇచ్చాడు. ప్రస్తుతం అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో తన జిమ్ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్, ఆరోగ్యకరమైన అంశాలను తెలియజేస్తున్నాడు. ఆపదలో తమను తాము ఎలా రక్షించుకోవాలనే నేర్పుతున్నాడు.

ముమ్మిడివరంలో త్వరలోనే జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించేందుకు స్థలాన్ని కూడా సేకరించాడు. అందుకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, ఆర్థిక భరోసా కోసం రారాజు ఎదురు చూస్తున్నాడు.



చిన్నప్పటి నుంచీ నాకు క్రీడలంటే ఆసక్తి ఉండేది. వాటిపైనే దృష్టి పెట్టాను. వివిధ పోటీల్లో పాల్గొన్నాను. దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల నుంచి మెళకువలు నేర్చుకున్నారు. విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇస్తున్నాను... రారాజు







పతకాల రారాజును అభినందిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ (పాత చిత్రాలు)

సాధించిన పతకాలు ఇవే...

2011: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2012: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం
2013: రాజమహేంద్రవరంలో జరిగిన స్టేట్ స్టైలిష్ ఇన్విటేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం.
2014: రాజమహేంద్రవరంలో జరిగిన 8వ స్టేట్ ఓపెన్ కరాటే-కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2014: విశాఖలో జరిగిన 35వ స్టేట్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2014: గాజువాకలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్, సుమన్ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2015: విశాఖలో జరిగిన 12వ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: విశాఖలో జరిగిన 18వ ఆలిండియా వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: కాకినాడలో జరిగిన 4వ ఏపీ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2016: విశాఖలో జరిగిన వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2016: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో బంగారు పతకం.
2018: గుంటూరులో జరిగిన 2వ ఏపీ స్టేట్ హిటో జపాన్ షాడోకాన్ కరాటే ఇన్విటేషన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.

ఉద్యోగులు ప్రజాసేవలో ముందుండాలి

ఆర్టీసీ జోన్-2 ఈడీ విజయరత్నం.. హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్ ప్రారంభం



హెవీ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఈడీ విజయరత్నం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని విజయవంతం చేసినందుకు ఉద్యోగులందరినీ అభినందిస్తున్నామని, అదే ఉత్సాహంతో ఉద్యోగులు ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఆర్టీసీ విజయవాడ జోన్-2 ఈడీ జి.విజయరత్నం అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యారేజీ ఆవరణలో మొక్క నాటారు. డిస్పెన్సరీ, బస్‌స్టేషన్, కార్గో కౌంటర్, గ్యారేజీ, డిపో మేనేజర్ కార్యాలయం, ఎర్నింగ్ సెక్షన్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందబోయే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ కె.మాధవ, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) శేషారావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేకు పరిశోధనా ప్రాజెక్టు మంజూరు

జేఎన్టీయూకే, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ రూ.2.81 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టును కాకినాడ జేఎన్టీయూకు మంజూరు చేసినట్టు రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఏఐ డ్రివెన్ సొల్యూషన్ ఫర్ ఆటోమేషన్ ఆఫ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ రెమిడియేషన్ అనే శీర్షికతో ఈ ప్రాజెక్టు రెండేళ్లలో అమలుకానుంది. సైబర్ ముప్పులను గుర్తించడం, వాటి నివారణలో ఆటోమేషన్ సాధించడం, దేశీయ డిజిటల్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత రూపకల్పనను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యమన్నారు. దీనికి సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి ప్రధాన పరిశోధకుడిగాను, డాక్టర్ టి.శివరామకృష్ణ సహ పరిశోధకుడిగాను వ్యవహరిస్తారని తెలిపారు. ఈ బృందం దేశంలోని సైబర్ సెక్యూరిటీ సంస్థలతో సమన్వయం సాధించి ప్రాజెక్టు ఫలితాలను జాతీయ భద్రతా అవసరాలకు అనుగుణంగా ఉండేలా పనిచేయనుంది. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ప్రధాన పరిశోధకుడు, సహ పరిశోధకుడిని అభినందించారు.

సత్యదేవుడి తెప్పోత్సవానికి పంటు ట్రైల్ రన్



పంటుకు ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 2న జరిగే సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే పంటుకు గురువారం దేవస్థానం, ఇరిగేషన్ అధికారులు ట్రయిల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం మరోసారి ట్రయిల్‌రన్ నిర్వహిస్తామని విద్యుత్ విభాగ డీఈ సత్యనారాయణ తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యాయని విజయవంతంగా పంపా సరోవరంలో మూడుసార్లు తిరిగిందని డీఈ తెలిపారు. త్వరలో పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతామన్నారు.

అన్నదానానికి రూ.2.10 లక్షలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.2.10 లక్షలు విరాళంగా సమర్పించారు. వేమగిరికి చెందిన పేరూరి శ్రీనివాసరావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.



విరాళం అందజేస్తున్న పేరూరి శ్రీనివాసరావు

ఇసుక దందాకు అడ్డేది..?

- పురుషోత్తపట్నం, గుండాల గోదావరి నదీ ప్రాంతాల్లో తవ్వకాలు
- తెలంగాణకు తరలింపు
- సరిహద్దుల్లో నిల్వలు
- బోర్డర్ దాటుతున్న ఆంధ్ర ఇసుక
- చోద్యం చూస్తున్న అధికారులు



పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదీలో ఇసుక తవ్విన దృశ్యం, తాత్కాలిక బాట

ఎటపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో గోదావరి నదీ ప్రాంతాలే లక్ష్యంగా చేసుకుంటూ కొందరు అక్రమార్కులు యధేచ్ఛగా ఇసుక దందాను నడిపిస్తున్నారు. ప్రధానంగా పురుషోత్తపట్నం, గుండాల, గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, ఎటపాక, తదితర గోదావరి నదీ ప్రాంతాల్లో తాత్కాలిక ర్యాంపులు ఏర్పాటు చేస్తూ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో ఇసుక అక్రమార్కులకు వరంగా మారుతోంది. పక్కనే అనుకుని(తెలంగాణ) భద్రాచలం పట్టణం ఉండడంతో ఇసుక అక్రమార్కులకు మరింత కలిసోస్తోంది.. దీంతో ఎటపాక మండలంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. రాత్రి వేళల్లో నదీ ప్రాంతాల్లో నిఘా వేస్తూ ఏంచక్కా ఇసుక దందాను చక్క బెడుతున్నారు. అందిన కాడికి ఇసుకను దండుకుంటున్నారు.. యధేచ్ఛగా ఆంధ్రా ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తూ.... తెలంగాణలోని భద్రాచలం పట్టణంలో అమ్మకాలు చేస్తూ సొమ్ములు గడిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలువరించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలువినిపిస్తున్నాయి.ఈ క్రమంలో పురుషోత్తపట్నంలో వారం రోజులుగా అక్రమార్కులు రాత్రుళ్లు తవ్వకాలు చేస్తూ ఇసుకను భద్రాచలం తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నడిపిస్తున్నారు. తెల్లవారే వరకు ఈ దందా నడుస్తుంది. ఆంధ్రాలో తవ్వకాలు చేపడతూ... తెలంగాణలో అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌లోడ్‌ఇసుకను తెలంగాణలో రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయిస్తున్నారు. ఇదేకాక అక్రమార్కులు గోదావరి ప్రాంతాల నుంచి తవ్వకాలు చేసిన ఇసుకను సరిహద్దు ప్రాంతాల్లో నిల్వలు ఉంచుతున్నారు. ముఖ్యంగా ఎటపాకలోని ఓ ప్రయివేట్ ట్రాక్టర్ షోరూం పక్కన, ఇదే ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద, రాజుపేట సమీపంలో పలు చోట్ల, ఇసుక నిల్వలు పెడుతూ అర్ధరాత్రుళ్లు ఆంధ్రా సరిహద్దును దాటిస్తున్నారు. టిప్పర్ లోడ్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, ట్రాక్టర్ దూరాన్ని బట్టి రేటు రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఈ దందా అంతా రాత్రి సమయంలోనే చక్కబెడుతున్నారు.తెల్లవారే సరికి దందా చేసినట్టు ఆనవాళ్లు కూడా కన్పించకుండా చేస్తారు. ఇసుక దందా నిరంతరం జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు కన్నెత్తయినా చూడడంలేదని విమర్శలు విన్పిస్తున్నాయి. కాగా బుధవారం అర్ధరాత్రి పురుషోత్తపట్నం గోదావరి నదీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో రెవెన్యూ అధికారులు సరిహద్దులోని సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద నిఘా పెట్టారు.ఆంధ్రాలోని పురుషోత్తపట్నం నుంచి ఇసుక లోడ్ వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పురుషోత్తపట్నం గ్రామస్థుల్లో కొందరు ఈ దందా నడిపిస్తున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది.ఈ విషయమై తహశీల్దార్ కారం సుబ్బారావును వివరణ కోరగా పురుషోత్తపట్నం నదీ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపినట్టు సమాచారం అందిందని, దాంతో గురువారం ఆ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు యంత్రాలతో కందకాలు తవ్వినట్టు చెప్పారు. అలాగే రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.





ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం



పాశుపతాభిషేకం నిర్వహిస్తున్న రుత్వికులు

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంత్యుత్సవాల్లో రెండో రోజైన గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి.ఉదయం శ్రీపాదశ్రీవల్లభుడికి సహస్ర లింగార్చన, మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం జరిపారు. సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్ర హోమం, దత్త మూలమంత్ర హోమం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు.ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు రుత్వికులు ప్రత్యేక పూజలు, గో పూజ నిర్వహించారు.ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసన్న దేవస్థానానికి వీల్‌చైర్ బహూకరణ

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి విజయవాడకు చెందిన భాష్యకార చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు వీల్ చైర్‌ను బహూకరించారు. రూ.20వేలు విలువగల ఈ వీల్‌చైర్‌ను భక్తుల సౌకర్యార్థం ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఏసీ అందజేశారు.

వంద రోజుల కార్యాచరణను పక్కాగా అమలు చేయాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ నాగమణి

కరప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నిర్దేశించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేసి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. కాకినాడ జిల్లా కరప జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సిలబస్ పూర్తి, విద్యార్థుల ప్రగతి, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ప్లానింగ్‌తో పరీక్షలకు ప్రిపేరై మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం మెయిన్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని, వర్క్ బుక్స్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో సాయిదుర్గకు కాంస్యం




అంబాజీపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన కె.సాయిదుర్గ బ్రాంజ్ మెడల్ సాధించినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో సాయిదుర్గ అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయిదుర్గను పలువురు అభినందించారు.

రాజమహేంద్రవరం రైల్వే స్టేషనులో 'యాత్రి సువిధా కేంద్రా'



- రద్దీ సమయంలో హైరానాకు చెక్
- ఢిల్లీలో విజయంతో మరిన్ని ఏర్పాటు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- ద.మ.రైల్వే జోన్‌లో రాజమండ్రి ఎంపిక

రాజమహేంద్రవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ని ప్రయాణికుల నిర్వహణ కోణంలో మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రయాణికులు పోటెత్తినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండడమే ప్రధాన ఉద్దేశంగా ఢిల్లీ మాదిరిగా ప్యాసింజర్స్ హోల్డింగ్ ఏరియాలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించనున్నారు. ఈ 'యాత్రి సువి. దా కేంద్రా'లను దీపావళి, ఛత్‌పూజా సందర్భంగా ప్రయాణికుల నియంత్రణలో భాగంగా ఢిల్లీలో నిర్మించి విజయం సాధించారు. దీంతో 16 రైల్వేజోన్లలోని 76 రైల్వే స్టేషన్లలో వీటిని 2026 పండుగల సీజన్‌లోపుగా పూర్తిచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ జాబితాను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాచిగూడతోపాటు రాజమండ్రి రైల్వేస్టేషను కూడా ఉంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో భద్రత దగ్గర నుంచీ సదుపాయాల వరకూ ఇబ్బందులు పడకుండా, అప్పటికప్పుడు హైరానా లేకుండా చేయడమే 'యాత్రి సువిధా కేంద్రా'ల ముఖ్య లక్ష్యంగా చెప్పవచ్చు. దీనిలో భాగంగా ఆయా ప్రదేశాల్లో టికెట్ కౌంటర్లు, ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలు, ఉచిత తాగునీరు, వేచి ఉండడానికి ఏర్పాట్లు, ఆడ, మగ వారికి విడివిడిగా వాష్‌రూమ్స్, సీసీ కెమెరాలు, విచారణ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, అనౌన్స్‌మెంట్ సిస్టం తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. ఒకవేళ రైలు రాక ఆలస్యమైనా ఇబ్బందులు పడకుండా, అందరూ ఒకేచోట గుమిగూడడం, ప్లాట్‌ఫామ్‌లపై రద్దీ ఉండడం, రైలు వచ్చినప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉరుకులు పరుగులు పెట్టడం వంటి సమస్యలకు ఈ హోల్డింగ్ ఏరియాతో చెక్ పెట్టనున్నారు. ప్రస్తుతం రాజమండ్రి రైల్వేస్టేషను గుండా రోజుకు సుమారు 40వేల మంది ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సంఖ్య ప్రత్యేక దినాల్లో రెట్టింపు అవుతుంది. ఆ సమయంలో రైల్వే ప్లాట్‌ఫామ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. భద్రత కత్తిమీద సాముగా మారుతోంది. రానున్న పుష్కరాలకు రోజుకు ఈ రైల్వేస్టేషను ద్వారా దాదాపు 1.50లక్షల మంది ప్రయాణించవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యాత్రి సువిధా కేంద్రా నిర్మాణం ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. విధివిధానాలు స్థానిక అధికారులకు అందాల్సి ఉంది. ఢిల్లీలో 7వేల మంది ప్రయాణికులకు సరిపడా హోల్డింగ్ ఏరియాను అభివృద్ధి చేసి 150 వాష్‌రూమ్స్, టికెట్ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేయడంతో వేలాది మంది ప్రయాణికులను సులభంగా హ్యాండిల్ చేయగలిగారు. దీంతో యాత్రి సువిధా కేంద్రాలు మరిన్ని స్టేషన్లలో అవసరమని గుర్తించారు. ఆ జాబితాలో రాజమండ్రి ఉండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





ఆకాశంలో రెడ్ అలర్ట్

యానాం ఫెర్రీరోడ్డులోని రాజీవ్‌గాంధీ బీచ్ గోదావరి ఒడ్డున ఆకాశం ఎర్రబడింది. గత నాలుగు రోజులుగా మొంథా తుఫాన్‌తో ముసిరి ఉన్న ఆకాశం గురు వారం సూర్యుని రాకతో సూర్యాస్తమ సమయంలో ఆవిష్కృతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

-యానాం-ఆంధ్రజ్యోతి

పోలవరం కాలువలో పడి వ్యక్తి మృతి


చరణ్ మృతదేహం

గోకవరం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పోల వరం కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్ళపల్లి చరణ్(20), మన్యం వెంకటేష్, ఆరుగుల్లి సతీష్ కలిసి అచ్చుతాపురం-తంటి కొండ గ్రామ సమీపంలో ఉన్న పోలవరంకా లువలో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈక్రమ ంలో కాలువ దాటుతుండగా నీటి ఉధృతికి చరణ్ కొట్టుకుపోయాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో వారు రంగప్రవేశం చేసి నాటు పడవ సహాయంతో ఈతగాళ్ళను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్ మృత దేహాన్ని ఈతగాళ్లు కాలువ నుంచి బయటకు తీసికొచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్లపల్లి దుర్గ, నాగమణి దంపతులకు కుమారుడు చరణ్‌తోపాటు ఇద్దర కుమార్తెలు ఉన్నారు. దుర్గ గోకవరంలో మొక్కజొన్న పొత్తులు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్‌కు ఆరు నెలలు క్రితమే వివాహమైనట్లు సమాచారం.

యువకుడి మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రెండ్రోజుల క్రితం సముద్రంలో గల్లంతైన ఓ మత్స్యకార యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరాం (21) భార్య మీనాక్షి, ఒక కుమారుడు ఉన్నారు. ఆ యువకుడు ఓ బోటుపై పనిచేస్తూ చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో స్థానిక కుంబాభిషేకం రేవు వద్ద బోటును సహచరుల సహాయంతో లంగర్‌వేసి నిలుపుదల చేశాడు. అయితే ఆ సమయంలో తుఫాను తాకిడి ఉధృతంగా ఉండడంతో బోటును మరింత భద్రత ఉండే ప్రదేశంలో నిలుపుదామన్న ఆలోచనతో స్థానిక ఏటిమొగ కల్వర్ట్ వద్ద నిలుపుదామన్న ఆలోచనతో మంగళవారం సహచరులతో కలిసివెళ్లి లంగరు తీస్తున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన పెద్ద అల సాయిరాంను సముద్రంలోనికి లాగేయడంతో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలింపులు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ దొరకలేదు. గురువారం కుంభాభిషేకం సమీపంలోకి జీఎంఆర్ పవర్‌ప్లాంట్ వద్ద సాయిరాం మృతదేహం పోలీసులకు లభ్యమయ్యింది. అనంతరం పోర్టు సీఐ సునీల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు వెళితే ఇంటిని దోచేశారు

కాకినాడరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌మండలం తూరంగికి చెందిన డి.శ్రీనివాసరావు రిలయన్స్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాడు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బీరువాలో పెట్టిన 17 గ్రాముల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు చోరీకిగురయ్యాయని, బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగి..తగ్గి..పెరుగుతూ

'ఏలేరు'కు భారీగా ఇన్‌ఫ్లో

- కాలువలకు 8,675 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- పొంచి ఉన్న భారీ వరద ముంపు ప్రమాదం
- రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు కరవు


గొల్లప్రోలు కాలువ వద్ద ఏలేరు వరద నీటి ఉధృతి


ఏలేరు నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏలేరుకు భారీగా వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోస్ రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉదయం ఒకేసారి భారీగా పెరిగి మరలా తగ్గుతూ వచ్చి సాయంత్రానికి మరోమారు పెరగడంతో దిగువకు భారీగా వరద జలాలు విడుదల చేయక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే జరిగితే వేలాది ఎకరాలు ముంపునకు గురికావడంతో పా టు గ్రామాల్లోకి ఏలేరు వరద నీరు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి.

పిఠాపురం/ఏలేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి పెరుగుతున్న ఇన్‌ఫ్లోస్ 10గంటల సమయంలో ఒక్కసారి 38వేల క్యూసెక్కులకు చేరడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. తదనంతరం తగ్గుతు, పెరుగుతూ మధ్యాహ్నం 12, సాయంత్రం 5గంటల సమయంలో 16-12వేల క్యూసెక్కులకు తగ్గిందని ఊపిరి పీల్చుకునే సమయంలోనే సాయంత్రం 6గంటలకు మరోసారి ఇన్‌ఫ్లోస్ 23,600 క్యూసెక్కులకు చేరాయి. దీంతో ఉదయం 6గంటలకు 85.39 మీటర్లుగా ఉన్న నీటిమట్టం 85.67మీటర్లకు చేరగా, నీటినిల్వలు 21.74 టీఎంసీలు నుంచి 22.30 టీఎంసీలకు పెరిగాయి. గరిష్ట నీటిమట్టం 86.56మీటర్లు కాగా నీటిని 24.11 టీఎంసీల వరకూ నిల్వ ఉంచే అవకా శం ఉంది. ఇదే జరిగితే ఇన్‌ఫ్లోస్ ఎంత వస్తే అంతా దిగువకు విడుదల చేస్తారు.

అవుట్‌ఫ్లోస్ పెంపు

ఉదయం 4,675 క్యూసెక్కులుగా ఉన్న నీటి విడుదలను 10గంటలకు 5,675 క్యూసెక్కులకు పెంచగా, 11 గంటలు దాటిన తర్వాత 7,175 క్యూసెక్కులకు, రాత్రి 9 గంటలకు 8,675 క్యూసెక్కులకు చేరుకుంది. ఏలేరు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుతున్న తరుణంలో నీటి విడుదల రాత్రి ఏ సమయంలోనైనా 10వేలు క్యూసెక్కులకు, అప్పటికి ఇన్‌ఫ్లోస్ తగ్గకుంటే 15వేల క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. మొంథా తుపాన్ దృష్టిలో ఉంచుకుని ఏలేరు రిజర్వాయర్ ఉన్న నీటిని దిగువకు విడుదల చేయడంతో భారీగా ఇన్‌ఫ్లోస్ వచ్చినా వెంటనే భారీగా నీరు విడుదల చేసే పరిస్థితి తప్పిందని వారు తెలిపారు.

కోతకు గురైన సముద్ర తీరం

- కెరటాల ఉధృతికి తలపంటిపేట తీరంలో పదిమీటర్ల మేర కోత


తలపంటిపేట తీరంలో సముద్రంకోతకు గురైన దృశ్యం


తొండంగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని సముద్ర తీరం పలుచోట్ల పదిమీటర్ల మేర కోతకు గురైంది. మొంథా తుఫాను నేపథ్యంలో కెరటాల ఉధృతికి తీరం నుంచి ఒడ్డుకు సుమారు పది మీటర్ల మేర కోత వేసింది. తలపంటిపేట తీరంలో గురువారం ఉదయానికి ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడి తీరంలో హుకుంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ కార్యకలాపాలు సాగిస్తుంటారు. వారు చేపలు ఎండబెట్టుకునే ప్లాట్‌ఫాం కూడా కెరటాల ఉధృతికి ఛిన్నాభిన్నమైంది. సమీపంలోని హేచరీల నిమిత్తం వేసిన పైప్‌లైన్లు భూమి మట్టానికి వేయ గా వాటి కింద ఉన్న ఇసుక కూడా కోతకు గురికావడంతో పైపులు కర్రలపై వేలాడుతూ కనిపిస్తున్నాయి.

పంపా రిజర్వాయర్‌కు పెరిగిన నీటిమట్టం

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయర్‌కు ఎగువప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటివరకు 99 అడుగుల నీటిమట్టం గురువారం 101 అడుగులకు చేరింది. 1700 క్యూసెక్కులు నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా వరద కాలువ, స్పిల్‌వే నుంచి 1650 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. పుష్కర అక్విడెక్ట్‌వద్ద పనులకు ఆటంకం కలుగకుండా గట్టును కొంతమేర తగ్గించడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు పేర్కొన్నారు.


పంపా రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న దృశ్యం

అక్కడా.. ఇక్కడా.. గోదారే..


గోకవరంలో నీటమునిగిన దేవీపట్నం పునరావాస కాలనీ

దేవీపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుతో గోదావరి ముంపునకు గురైన దేవీపట్నం నుంచి గోకవరం గ్రామశివారు గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఒక పునరావాస కాలనీగా ఏర్పడింది. ఈ పునరావాస కాలనీ నిర్మాణ పనులు గత ప్రభుత్వం మొదలుపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంకా పూర్తికాలేదు. వర్షాకాలంలో కాలనీ చుట్టూ వర్షపునీరు చేరి గోదావరిని తలపిస్తోంది. దీంతో కాలనీలో నివశిస్తున్న నిర్వాసితులు గోదావరి ముంపు నుంచి దూరంగా తీసుకువచ్చిన అధికారులు ఇక్కడ వరద ముంపునకు గురయ్యేలా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడా గోదారే ఇక్కడా గోదారే అన్నట్లుగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతంలో కాలనీ నిర్మించడంతో వర్షపునీరు ఈ కాలనీలోకి చేరుతుంది. మెట్టప్రాంతంలో నిర్మించాల్సిన కాలనీ ఇలా లోత ట్టు ప్రాంతంలో నిర్మించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కాలనీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి వర్షపునీరు నిల్వఉండకుండా సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాస్ హత్యకు ఆడియో లీక్ కారణమా..

- ఐదుగురిపై కేసు నమోదు
- పరారీలో నిందితులు


కంచిపల్లి శ్రీనివాస్ (పాతచిత్రం)

అమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్యకు దారితీసిన పరిస్థితులపై అమలాపురం పట్టణ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. శ్రీనివాస్ హత్యకు, ఆడియో లీక్‌కు సంబంధం ఏమైనా ఉందా అనే కోణంలోను విచారణ చేపట్టారు. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం తొలుత శ్రీనివాస్ అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ మృతదేహం 29వ తేదీన పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో గుర్తించామన్నారు. దాంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో హత్య కేసుగా మార్పుచేశామని వివరించారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖవ్యాపారి గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు), అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, కారు డ్రైవర్ భాస్కర్ల ప్రసాద్, రావులపాలేనికి చెందిన అనిల్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు. మృతుని భార్య దేవి తెలిపిన సమాచారం ప్రకారం తన భర్త శ్రీనివాస్ 25వ తేదీ సాయంత్రం వరకు పట్టణానికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతోనే ఉన్నట్టు ఫోన్ సంభాషణల ఆధారంగా చెప్పారు.పాతకక్షల నేపథ్యంలోనే ముందస్తు వ్యూహంతో అప్పన్నే శ్రీనివాస్‌ను వారికి అప్పగించిఉంటాడని భావిస్తున్నారు.

ఆడియో లీకే హత్యకు కారణమా..

ఈ కేసులో ప్రధాన నిందితుడైన గంగుమళ్ల కాసుబాబుతో మృతుడు శ్రీనివాస్‌కు తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగిందని ఆడియో రికార్డింగును బట్టి తెలుస్తోంది. వ్యక్తిగత దూషణలకు సంబంధించిన ఆడియో రికార్డింగుచేసి పలువురికి పంపించడంవల్లే హత్యకు దారితీసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ ఘటన జరిగి కొన్ని నెలలు గడుస్తుంది. ఆడియో లీక్‌తో పాటు మరేదైనా బలమైన కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌ను ఎక్కడ హత్య చేశారు. ఏ వాహనంపై గోదారి నదీ పాయ వద్దకు తరలించారు. ప్రధాన నిందితులతో పాటు మరెవరైనా హత్యకు సహకరించారా అన్న కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు. అయితే హత్య జరిగిన రోజు నుంచి ప్రధాన నిందితులు పరారీలోనే ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక బృందాలను నియమించారు. హత్యకు ప్రధాన కారణమైన ఆడియోగా భావిస్తున్న రికార్డింగు వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దా.. దా.. నిన్ను చంపేస్తా అంటూ హెచ్చరించిన మాటలు సైతం ఆడియోలో ఉన్నాయి.

అనపర్తిలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలో మూడు కాసుల బంగారు తాడు చోరీ


పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు విజయలక్ష్మి

అనపర్తి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి కొప్పవరం రోడ్డులో గురువారం రాత్రి మో టార్ సైకిల్‌పై వెడుతున్న దంపతులను వెంబడించిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకుని వెళ్ళడమే కాకుండా వీరి బైక్‌ను కాలితో తన్నడంతో దంపతులు పంటపొలాల్లో పడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన వడ్లపూడి విజయలక్ష్మి పనులు చేసుకునేందుకు హైదబాద్ వెళ్ళింది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఆమెను ద్వారపూడిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కించేందుకు భర్త రాఘవ ఆమెను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని కొప్పవరం మీదుగా అనపర్తి వస్తున్నారు. అనపర్తి చేరుకునేసరికి గుర్తు తెలియని వ్యక్తి మరో మోటార్ సైకిల్‌పై వెనుకగా వచ్చి ఆమె మెడలోని చైన్ అందిపుచ్చుకుని వారి మోటార్ సైకిల్‌ను కాలితో తన్నడంతో దంపతులు ప్రయాణిస్తున్న వాహనం పంటపొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం


చొప్పెల్లలో సుడిగాలితో ధ్వంసమైన ఇల్లు

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం సృష్టించి అనేక ఇల్లుకు నష్టం కలిగించింది. గురువారం ఉదయం గోదావరి నదీ నుంచి చొప్పెల్ల లాకుల మీదుగా చొప్పెల్ల నుంచి నవాబుపేట వెళ్లే రహదారిలో ఉన్న పలు ఇళ్లకు నష్టం కలిగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్లతోపాటు పలు చెట్లుకు భారీ నష్టం కలిగింది. ఈటోర్నోటో భారీ గాలులతో విరుచుకుపడింది. ఇది కేవలం వంద అడుగుల పరిధిలో ధ్వంసం చేసుకుంటూ నష్టం సంభవించింది. ఈప్రమాదం జరిగిన తక్షణం సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, వీఆర్వో సూర్యప్రకాష్ తదితరులు అక్కడికి చేకుని పరిస్థితి సమీక్షించారు. ఈప్రమాదంలో అనేక ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు భారీగా ధ్వంసమైనట్లు వారు వివరించారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

రాయవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతిచెందింది. స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి వీధిలో గరగ బాబులు పాడిరైతు ఇటీవల లక్ష రూపాయలు తో గేదెను కొనుగోలు చేశాడు. ఇటీవల గేదెకు లేగదూడ పుట్టింది. పశువులపాక వద్ద నాలుగు కుక్కలు దాడిచేసి లేగదూడను హతమార్చాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందడంతో గేదె పాలు ఇవ్వడం లేదని పాడిరైతు ఆవేదన చెందుతున్నాడు. కుక్కల సమస్యను పై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశాడు.

నాటుకోళ్లు దొంగిలిస్తున్న వ్యక్తుల అరెస్ట్


పోలీసులు అరెస్టుచేసిన నిందితులు

గోకవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాటు కోళ్ళు దొంగిలిస్తున్న నల్గురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబూరావు అనే వ్యక్తి ఇంటి వద్ద పెంచుకుంటున్న నాటుకోళ్ళను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు అందింద న్నారు. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా అదే గ్రామానికి చెందిన ఆవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్ అనే వ్యక్తులు కోళ్లు దొంగి లించినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేయడంతో పాటు సుమారు రూ.30,000ల విలువ గల నాటు కోళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. నింది తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మాక్ అసెంబ్లీపై మండల స్థాయి పోటీలు

రాజోలు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం మాక్ అసెంబ్లీకి విద్యార్థులను ఎంపిక చేయడానికి మండల స్థాయిలో పోటీలు నిర్వహించామని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు నియోజకవర్గ స్థాయిలో వివిధ అంశాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటార

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

అంబాజీపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు కుమ్మరి గరువు వద్ద అరిగెల శ్రీరామకృష్ణకు చెందిన వంటషెడ్డు, కొబ్బరికార్యాలయం పుస్తకాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతయ్యాయి. గృహోపకరణ వస్తువులు, వంట సామగ్రి దగ్ధమయ్యాయి. రూ.1.5లక్షల ఆస్తినష్టం ఏర్పడినట్టు అమలాపురం అగ్నిమాపక అధికారి ఎం.రాజా తెలిపారు.

25వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం: ఎమ్మెల్యే దాట్ల


ఐ.పోలవరం: టి.కొత్తపల్లిలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో తుఫానుకు 25వేల ఎకరాల్లో సార్వాకు తీవ్ర నష్టం జరిగినట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. బాణాపురం, టి.కొత్తపల్లి, పాతయింజరం గ్రామాల్లో గురువారం ఆయన నేలనంటిన వరిచేలను పరిశీలించారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు గ్రామాల వారీగా పంట నష్టాల నివేదికలను త్వరితగతిన ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, టీడీపీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, ముదునూరి రామలింగరాజు, నీటి సంఘం చైర్మన్ రాయపురెడ్డి స్వామినాయుడు, సొసైటీ డైరెక్టర్ మద్దిరెడ్డి కుమార్, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, వ్యవసాయాధికారిణి ఎం.వాణి, డీటీ మహాలక్ష్మీనాయుడు, రైతులు రాయపురెడ్డి బ్రహ్మానందం, అరవ సత్తిబాబు, పశ్చిమాల భగవాన్‌దాస్, బొంతు శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

లింకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు


మామిడికుదురు: నగరం ఏఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏఎంసీ ద్వారా లింకు రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. నగరం ఏఎంసీ పాలకవర్గ సమావేశం చైర్మన్ పెనుమాల లక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుచేసే విధంగా కార్యాచరణ చేస్తానన్నారు. మార్కెటింగ్ నిధులతో రైతులకు ఉపయోగపడే వంతెనలు, కార్యాలయం ఇరువైపులా మిగిలిన ప్రాంతంలో ప్రహరీ నిర్మిస్తామని, రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎక్స్‌అఫిషియో సభ్యునిగా సమావేశానికి హాజరైన నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, పాలకవర్గ సభ్యుల, ఏఎంసీ సెక్రటరీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాల అంచనాలకు బృందాల ఏర్పాటు


మామిడికుదురు: నగరంలో పడిపోయిన వరిచేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

మామిడికుదురు,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో తుఫాన్‌ప్రభావంతో వెయ్యి ఎకరాల పంట నష్టపోయినట్టు అంచనా వేసినట్టు మండల వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు సార్వా వరి నేలనంటిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా నేలనంటిన పంట వర్షం నీటిలో మునిగి ఉండడం వల్ల కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మండలంలోని 13 గ్రామాల్లో 2707 ఎకరాల్లో సార్వా పంట సాగుచేశారని, తుఫాన్ ప్రభావంతో వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా వేసేందుకు 13 బృందాలను క్షేత్రస్థాయిలో ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈబృందాలు గ్రామాల్లో పర్యటించి పూర్తిస్థాయిలో నష్టాలను అంచనా వేయనున్నట్టు తెలిపారు.

దెబ్బతిన్న పంటల నమోదు

అంబాజీపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వాణిజ్య పంటలను గుర్తించి నివేదిక తయారుచేస్తామని మండల ఉద్యానశాఖాధికారి దిలీప్‌తెలిపారు. మండలంలో ఉద్యాన పంటలకు సంబంధించి పంటనష్ట నమోదు చేపట్టామన్నారు. అరటి, ఇతర పంటలకు సంబంధించి ఆయా గ్రామాల్లో వీహెచ్‌ఏల ద్వారా పంట నష్టాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. పంటనష్టాలను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు.

పంటల నమోదులో అధికారుల నిమగ్నం

ముమ్మిడివరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సంభవించిన నష్టాలను నమోదులో అధికారులు నిమగ్నమయ్యారు. బృందాలుగా ఏర్పడి నష్టాలను నమోదుచేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తుఫాన్ కారణంగా వీచిన పెనుగాలులు, భారీ వర్షాలకు మండలంలో 2వేల ఎకరాలు చేలు నేలకొరిగాయి. 25విద్యుత్ స్తంభాలు విరిగిపోగా 3ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం వాటిల్లింది. 60వరకు కొబ్బరిచెట్లు విరిగిపోయాయి. 15తాటాకు, పక్కా ఇళ్లకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాలో తేలగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. వరి పొలాలు, ఉద్యానపంటలు, ఇళ్ల నష్టాలు తదితర నష్టాల అంచనాలకు సంబంధించి బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి అంచనాలు నమోదు చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి మండలంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించారు. కొత్తలంక, రాజేలంక, కొమానపల్లి, గేదెల్లంక, చినకొత్తలంక తదితర గ్రామాలకు గురువారం సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ జరగలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరితగతిన విద్యుత్‌ను పునరుద్ధరించి అంధకారం నుంచి విముక్తి కలిగించాలని వారు కోరుతున్నారు.

యానాం తుఫాన్ బాధితులను ఆదుకోవాలి


పుదుచ్చేరి సీఎం రంగసామితో తుఫాన్‌పై వివరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టం వాటిల్లిన యానాం బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఎం ఎన్.రంగసామిని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. గురువారం పుదుచ్చేరి అసెంబ్లీహాల్‌లో సీఎం రంగసామితో మల్లాడి సమావేశమయ్యారు. మొంథా తుఫాన్‌తో యానాంలో ఏర్పడిన నష్టాన్ని సీఎంకు వివరించారు.అనంతరం వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి రూ.5వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, భారీ వర్షాలకు రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల కార్యదర్శులకు వినతిపత్రాలను మల్లాడి అందజేశారు.

ఆసుపత్రి అభివృద్ధి విషయంలో రాజీ లేదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, సమస్యలుంటే నాదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో గురువారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా సేవలందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. ఆసుత్రికి కావాల్సిన సదుపాయాలు కోసం సీఎస్ఆర్ ఫండ్స్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆసుపత్రి పక్కనే త్వరలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆసుపత్రి ఎదుట డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్‌ను పరిశీలించారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చి ఆసుపత్రిలో ఆర్థోపెడిక్‌కు సంబంధించిన చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావును అభినందించారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, కోట రాజేంద్రప్రసాద్, వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వందన, డాక్టర్ పవన్, డాక్టర్ చందన, డాక్టర్ మాధురి, డాక్టర్ సురేంద్ర, హెడ్‌నర్స్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ దగ్ధం



అమలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురం కొంకాపల్లి కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి మోటార్‌బైక్ దగ్ధమైంది. పార్క్ చేసిన మోటార్‌సైకిల్‌ను ఆంబోతు ఢీకొట్టి పడవేసింది. దీంతో మోటార్‌సైకిల్ పడిపోయిన ప్రక్కనే ఆలయంలో వెలిగించిన దీపానికి పెట్రోల్ అంటుకుని మోటార్‌సైకిల్ దగ్ధమైంది.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి


బాధితులను పరామర్శిస్తున్న కొల్లు పెద్దిరాజు

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారులను మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు గురువారం పరామర్శించారు. మొంథా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారుల ఇళ్లను పరిశీలించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. స్థానిక మత్స్యకార రాష్ట్ర నాయకుడు తిరుమాని ఆచార్యులు, కూటమి శ్రేణులతో కలిసి తుఫాన్ వల్ల పడిపోయిన ఇళ్లను పరిశీలించారు. అలాగే బాధితులను పరామర్శించారు. అనంతరం హార్బర్, మత్స్యకార గ్రామంలోకి చొచ్చుకు వస్తున్న పోటునీరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఇల్లింగి వెంకటరమణ, పోతాబత్తుల రాంబాబు, బులిస్వామి, వనమాలి ఆదినారాయణ, జనార్ధనరావు, పొన్నాల లోకేష్ పాల్గొన్నారు.

చాకుతో దాడి: ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్లవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వల గుడ్డ చించిన విషయం ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణకు దారితీసింది. దేవగుప్తం నల్లగుంటకు చెందిన కోడికత్తులు కట్టే దాసరి నాని చాకుతో గురువారం సాయంత్రం పెయ్యల రమణ, యలమంచిలి పెదవెంకటేశ్వరరావును పొడిచాడు. ఈ దాడిలో రమణ, పెదవెంకటరమణ తీవ్రంగా గాయపడగా అల్లవరం ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది'


చింతనలంకలో తుఫాన్‌కు నష్టపోయిన అరటిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలో తుఫాన్‌కు నష్టపోయిన నల్లచెరువు, చింతనలంక, వెలువలపల్లి గ్రామాల్లోని వరి, అరటి పంటలను ఆయన పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందజేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అరటి పంటకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి తుఫాన్ కారణంగా నష్టపోయామని రైతులు ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి, ఎంపీడీవో సరోవర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మద్దాల సుబ్బారావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపురాజు సత్యనారాయణరాజు, విళ్ల నవీన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, మామిళ్లపల్లి తాతయ్యనాయుడు, వర్రే శ్రీనివాస్, విళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు దక్కని వారికి రూ.27.75లక్షల అందజేత


టిడ్కో ఇళ్లు దక్కనివారికి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు టిడ్కో ఇళ్ల కోసం ఎనిమిదేళ్ల క్రితం సొమ్ములు చెల్లించిన బాధితులకు అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం గురువారం జరిగిన కార్యక్రమంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అప్పట్లో సొమ్ములు చెల్లించినా ఇళ్ల రాక తిరిగి సొమ్ములు అందక ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు సొమ్ములు విడుదల చేసింది. 30మంది బాధితులకు రూ.27.75లక్షల సొమ్ములను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులను సైతం తొలగించినట్టు వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలన్నారు. ఎవరైనా అర్హులుంటే వారికి టిడ్కో గృహాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కౌన్సిలర్ యేడిద శ్రీను, మాజీ కౌన్సిలర్లు తిక్కిరెడ్డి నేతాజీ, ఆశెట్టి ఆదిబాబు, జంగా అబ్బాయివెంకన్న, భాస్కర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

రావులపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అమలాపురంరూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నడిపూడి బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. అమలాపురం బైపాస్ రోడ్డులో ధనవర్ష పొదుపు సంస్థలో పనిచేస్తోన్న మహిళలతో పాటు మరి కొందరు ఆటోలో అయినవిల్లి మండలం నేదునూరులో ఇంటిక బయలుదేరారు. నడిపూడి అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటో ప్రక్కనే ఉన్న పంట బోదెలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని అమలాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన మండెపు మంగాలక్ష్మి(30) తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈప్రమాదంలో మరో ఎనిమది మంది గాయపడ్డారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేతన్నలకు ఆర్థిక సాయం అందించాలి



అమలాపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన అన్నివర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో పేరు తెచ్చారని దేవాంగ సంక్షేమసంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో మగ్గం గుంతల్లోకి నీరు చేరిపోవడంతో పాటు తుఫాన్‌కు ముందు కురిసిన భారీ వర్షాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత కార్మికులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత దినోత్సవం రోజున ప్రకటించిన విధంగా చేనేత కార్మికులకు భరోసా కల్పిస్తూ రూ.25వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

ముంపు బాధిత రైతులకు ప్రభుత్వ సాయం: ఏవో

అమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా చర్యలను చేపట్టినట్టు మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ తెలిపారు. మండల పరిధిలో ముంపు బారిన పడ్డ పంట పొలాలను ఆయన పరిశీలించారు. జనుపల్లి, భట్నవిల్లి, వన్నెచింతలపూడి, తాండవపల్లి, ఎ.వేమవరం, కామనగరువు తదితర గ్రామాల్లో పంట ముంపు బారిన పడగా వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. బాధిత రైతులకు ప్రభుత్వ సాయం అందించేందుకు పంట నష్టం అంచనాలు చేపట్టామన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు, గ్రామ కార్యదర్శులతో గ్రామ జట్లను ఏర్పాటు చేసి పంట నష్టాల నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మండలంలో 4724ఎకరాల్లో పంటసాగు జరుగుతుండగా 2100ఎకరాలు ముంపు బారిన పడినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. 380ఎకరాల్లో పంట నేలమట్టమైందన్నారు. గ్రామ జట్లు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అందించే నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ప్రవీణ్ తెలిపారు.

పరిశ్రమల సందర్శనకు బాలికలు

ముమ్మిడివరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఒకేషనల్ కోర్సు విద్యార్థినులు ఆ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పరిమళ ఆధ్వర్యంలో పరిశ్రమల సందర్శన కార్యక్రమానికి వెళ్లారు. అమలాపురం పట్టణంలో ఏఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాల, ఆశ్రిత బ్యూటీ సెలూన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం సీహెచ్ పరిమళ మాట్లాడుతూ విద్యార్థుల పరిశ్రమల సందర్శనతో నైపుణ్యాన్ని గ్రహించేందుకు వీలుంటుందని, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు. ఈసందర్శనలో పీడీ అన్నవరం, ఒకేషనల్ ట్రైనర్స్ డీవీఎస్ మాధుర్య, వి.చందన తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో కొవ్వొత్తుల పంపిణీ

ఉప్పలగుప్తం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగలేదు. గురువారానికి కూడా తీరగ్రామాల్లో విద్యుత్‌సరఫరా లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. పునరుద్ధరించిన గ్రామాల్లో సరఫరాకు తరచూ అంతాయం ఏర్పడుతోంది.వినియోగదారులు విద్యుత్ ఇబ్బందులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ వాసా దివాకర్‌ను కలిసి పలువురు ఈసమస్యపై మొరపెట్టుకున్నారు. తీరగ్రామాల్లో సరఫరా పునరుద్ధరణకు సమయం పడుతుందన్న సమాచారంతో ఆయన ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించారు. తీరగ్రామాల్లో గురువారం ఆయన కొవ్వొత్తులు పంపిణీ చేశారు. చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల పంపిణీ చేపట్టారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

యానాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం పరిపానాధికారి, ఓటర్ల నమోదు అధికారి అంకిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై చర్చించారు. 2002 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లు ప్రస్తుతం ఏ బూత్‌లో ఉన్నారా లేదా అనే విషయాలపై నివేదిక తయారు చేస్తామన్నారు. ఈసర్వేకు బూత్‌లెవిల్ అధికారులకు పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో యానాం ఎన్‌ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, యానాం కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్థాని దినేష్, యానాం ఎన్నికల డీటీ వి.రత్నరాణి, జ్యోతి, వెంకటేశ్వరరావు, ముమ్మిడి శంకర్, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

ముమ్మిడివరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయం వద్ద వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజలు సంతకాలు చేశారు. నియోజకవర్గ అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కాశి బాలమునికుమారి, రాష్ట్ర కార్యదర్శులు పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటి సంతకాల సేకరణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కోటి సంతకాల సేకరణ

పి.గన్నవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ జీవోను వెంటనే రద్దు చేయాలని నియోజకవర్గ వైసీపీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మొండెపులంకలో వైసీపీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్‌కుమార్, బూత్ కమిటీ వింగ్ రాష్ట్ర సెక్రటరి చేట్ల రామారావు, గ్రంధి రామకృష్ణ, కొల్లాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుమిత్ రామారావు జయంతి

రాజోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజోలు సాయిబాబా గుడి వద్ద ప్రముఖ న్యాయవాది, సోషల్ వర్కర్ యాలంగి రమేష్ కుమారుడు సుమిత్‌రామారావు 26వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత హెచ్‌ఎం చవాకుల సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సుమిత్ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాకే దేవీప్రసాద్ పాల్గొన్నారు. తొలుత సుమిత్‌రామారావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సుమిత్‌రామారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కళాకారులు దొండపాటి రాంబాబు, గుబ్బల సాంబశివరావులను రమేష్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజేటి సువర్ణరాజు, రాజబాబు, ఎం.అంబేడ్కర్, నీతిపూడి సత్యనారాయణ, ఏపుగంటి ఏడుకొండలు, గొల్లమందల సురేష్, గంటి రవి, కానూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

20వ రోజుకు చేరిన రిలే దీక్షలు

ముమ్మిడివరం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండు ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే దీక్షలు గురువారంతో 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని పోతుల భారతి, డి.పుష్పవతి, ఇసుకపట్ల దయమంతి, పోతుల సావిత్రి, గోడి ఆచమణి, ఇసుకపట్ల లలిత, మహిళలు సందర్శించి సంఘీబావం తెలిపారు.

'బాధితులను ఆదుకోవాలి'

ముమ్మిడివరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ డిమాండ్ చేశారు. వరిచేలకు ఎకరాకు రూ.25వేలు, ఉద్యాన పంటలకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, పడిపోయిన ఇళ్లకు రూ.50వేలు నష్టపరిహారం ఇచ్చి గృహరుణాలు, మత్స్యకారుల కుటుంబానికి రూ.5వేలు అందించాలని డిమాండ్ చేశారు.

దేవగుప్తం సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తుల ధర్నా



అల్లవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ గాలుల కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను మూడు రోజులైనా సరఫరాను పునరుద్ధరించక పోవడంతో గురువారం రాత్రి దేవగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సామంతకుర్రు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మూడు రోజులుగా సామంతకుర్రు గ్రామం అంధకారంలో ఉన్నా విద్యుత్ ఏఈకి ఫోన్‌చేస్తే సమాధానం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఏఈ నిర్లక్ష్య వైఖరి నశించాలి, సామంతకుర్రు గ్రామంలో అంధకారం తొలగించాలంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. కాకిలేటి హరికృష్ణప్రసాద్, కర్రి సూర్యనారాయణ, మేడిశెట్టి హరిబాబు, సామంతకుర్రు గ్రామస్తులు పాల్గొన్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

ముంపు ప్రాంతాల్లో బీఎస్పీ నాయకుల పర్యటన

అంతర్వేది, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం,అంతర్వేది గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో బీఎస్పీ నాయకులు పర్యటించారు. నియోజకవర్గ అధ్యక్షుడు నల్లి ప్రసాదరావు ఆధ్వర్యంలో నాయకులు ఇందిరమ్మకాలనీ, గునిశెట్టి చల్లయ్య గ్రూపు, సమీపంలో కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి తాగునీరు, వైద్యసేవలందించాలని, దోమల బెడద లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బూసి జాన్‌మోషే, ముత్యాల శ్రీనివాస్, ఆకుమర్తి భూషణం, చవ్వాకుల వెంకట్, కత్తిమండ సురేష్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మామిడికుదురు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం ఆయన మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి అక్కడ మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని కోరారు. ఆయనతో పాటు ఎంఈవో మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం బి.చిరంజీవిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అల్లవరానికి చెందిన వెలిచేటి జ్యోతిస్వరూప మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.10వేల విరాళాన్ని గురువారం ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దాతను ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.

'శంకర్ కుటుంబానికి అండగా ఉంటాం'

రాజోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సీఎంఎల్ కళాశాల సమీపంలో మొంథా తుఫాన్ కారణంగా పాడైన 11 కేవీ విద్యుత్ లైన్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్ తగిలి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సఖినేటిపల్లికి చెందిన యడ్ల శంకర్(39) మృతిచెందాడు. రాజోలు ఆసుపత్రి మార్చురీలో ఉన్న శంకర్ మృతదేహానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం నివాళులర్పించారు. శంకర్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, అడబాల విజయ్, పామర్తి రమణ, కడలి వెంకటరమణారావు, ఉలిశెట్టి అన్నపూర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అయినవిల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 26 భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అయినవిల్లి మండల విద్యావనరుల కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గురువారు జరిగిన పోటీలకు మండలంలోని పదకొండు ఉన్నత పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులు 40మంది హాజరయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచనలో వై.పూజషణ్ముఖప్రియ (ముక్తేశ్వరం) ప్రథమ, ఎం.శాలినిసత్యపద్మ (వీరవల్లిపాలెం) ద్వితీయ స్థానాలు సాధించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



రావులపాలెం మండలం రావులపాడులో తుఫాన్ కారణంగా ధ్వంసమైన అరటి తోటలను పరిశీలిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కోలుకోలేని దెబ్బ

• రైతులను నిండాముంచిన 'మొంథా' తుఫాన్ • పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళన • ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే బండారుకు రైతుల వినతి

రావులపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి, అరటి రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్టు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాడులో తుఫాన్ కారణంగా నష్టపోయిన అరటి, వరి, ఉద్యాన కూరగాయల పంటలను ఆయన పరిశీలించారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యేకు పలువురు వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నష్టం నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ముందు జాగ్రత్తలతో తొలగిన ముప్పు: ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన ముందస్తు జాగ్రత్తల కారణంగా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు, అధికారులు సమన్వయంతో పనిచేశారన్నారు. పూరిగుడిసెలు, రేకుల షెడ్లు, శిథిల భవనాల్లో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, పల్లి ఏసు, కొప్పిశెట్టి ప్రసాద్, జక్కంపూడి పార్వతి, కాసా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కుళ్లుతోంది: కష్టపడి పండించిన పంట మరో 20 రోజుల్లో చేతికి వస్తుందని ఎదురుచూస్తున్న తరుణంలో తుఫాన్ కారణంగా వారి ఆశలు కన్నీళ్లయ్యాయి. తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులు, వర్షాలకు ఆయా ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగి నీటమునిగింది. దీంతో ముంపునీటిలో చిక్కుకున్న వరిపొలాలు కుళ్లిపోతున్నాయి. దీంతో రైతులు ముంపునీటిని మళ్లించుకునేందుకు బోదెలను ఏర్పాటు చేసి ముంపునీరు మళ్లింపులో తలమునకలవుతున్నారు. రావులపాలెం మండలంలోని లంక పొలాలు, మెరక ప్రాంతాల్లో సాగుచేసిన ఆయా పంటలు తుఫాన్ ప్రభావానికి ధ్వంసమవగా, రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులు ధైర్యంగా ఉండాలి

కె.గంగవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నష్టాలపై రైతులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, విజయనగరం ఆర్టీసీ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ రైతులకు భరోసా ఇచ్చారు. గురువారం భట్లపాలికలో రిష్వంత్ రాయ్, తామరపల్లి గ్రామంలో బాలకృష్ణ పర్యటించారు. పడిపోయిన వరి పొలాలను వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు పంట నష్టం నివేదికలు వచ్చిన తరువాత ఆదుకుంటారని వారన్నారు. కార్యక్రమంలో వారి వెంట బ్రహ్మపురి సొసైటీ అధ్యక్షుడు గెడ్డం పల్లపురావు(బన్నీ), గన్ని శ్రీనివాసు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టం పక్కాగా నిర్వహించాలి
తహసీల్దార్ శ్రీరామప్రసాద్

తుఫాను కారణంగా ఆయా గ్రామాల్లో జరిగిన పంట నష్టాల నమోదును పక్కాగా నిర్వహించాలని తహశీల్దార్ శ్రీరామప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వీఏఏలు, వీఆర్‌వోలతో సమావేశం జరిపారు. పంట నష్టపోయిన రైతుల భూమి వద్దకు వెళ్లి వాటి వివరాలను యాప్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి, వీఏఏలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలసి పాణింగపల్లి, సత్యవాడ, కూళ్ల గ్రామాల్లో పర్యటించారు. పడిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. పామర్రులో మాతృ వియోగంతో బాధపడుతున్న ఎన్.సూర్యనారాయణ(బాబి)ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెట్టా శ్రీనివాసరావు, పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

కొత్తపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. గురువారం బొరుసువారి సావరంలో మొంథా తుఫాన్ ప్రభావంతో పాడైన వరిపొలాలు, అరటితోటలు, వాణిజ్య పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. తుఫాన్ కారణంగా పంట చేతికి వచ్చే సమయానికి వరి పొలాలు నేలన్నంటాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని వారికి ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాష్ నారాయణ, కోటిపల్లి దామోదర్, గొనేమడతల కనకరాజు, అన్యం సత్యనారాయణ, వలపశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం
మార్టేరు పరిశోధన కేంద్రం డైరెక్టర్ సత్యనారాయణ

ద్రాక్షారామ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను వల్ల జరిగిన పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం డైరెక్టరు పీఎం సత్యనారాయణ తెలిపారు. రామచంద్రపురం మండలం చోడవరంలో గురువారం తుఫాను వల్ల దెబ్బతిన్న వరిపొలాలను కోనసీమ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రైతులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులను తట్టుకునే వంగడాలను సాగు చేయాలని కోరారు. స్థానిక అధికారులు పంట నష్టాన్ని నమోదు చేస్తారని తెలిపారు. రైతులు నూతన వంగడాలపై దృష్టిసారించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సేద్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

వరిచేలు పరిశీలన

కపిలేశ్వరపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మొంథా తుఫాన్ వల్ల పంట నష్టానికి గురైన వరిచేలను విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు నెక్కంటి బాలకృష్ణ గురువారం పరిశీలించారు. మండలంలోని వడ్లమూరు, నిడసనమెట్ట, నల్లూరు, కాలేరు, టేకి, తదితర గ్రామాల్లో పంటదెబ్బతిన్న వరిపొలాలను వారు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు అండగా ఉంటాం: తుఫాను వల్ల పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటామంటూ కూటమి నాయకులు భరోసా ఇచ్చారు. గురువారం అంగరలో పంట దెబ్బతిన్న పొలాలను వారు పరిశీలించి రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అంగర గ్రామంలో 75 శాతం పంట నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది అంచనా వేశారన్నారు. పంట నష్టం వివరాలను రైతుసేవా కేంద్రం సిబ్బంది సేకరిస్తున్నారని తగిన నష్టపరిహారాన్ని అందజేస్తారని కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మత్స గంగరాజు, త్రిపురశెట్టి నాని, ఆచంట చిన్న, జనసేన నాయకులు పిల్లా బసవరాజు, తోరాటి శ్రీనివాస్, దానేటి శరత్, వీఆర్‌వోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పంట నష్టాల గుర్తింపునకు చర్యలు

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పంటలను గురువారం అధికారుల బృందం పరిశీలించింది. ఆలమూరు మండలం మోదుకూరులో తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలను తహశీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఎ.రాజు, పలువురు వీఆర్వోలు, అగ్రికల్చర్ సిబ్బంది వరి పొలాలను పరిశీలించారు. నర్సిపూడిలో కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అధ్వర్యంలో అధికారులు, కూటమి నాయకులు పంట నష్టాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పంట నష్టం అంచనాకు పర్యటన

రాయవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొంథా తుఫాను కారణంగా వరి చేను నేలవాలడంతో పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని లొల్ల గ్రామంలో పంట పొలాలను పరిశీలించిన సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు మాట్లాడుతూ తుఫాను సమయంలో ప్రాణం నష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. పునరావాస కేంద్రాలును ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు , ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టారన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకునేందుకు అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ వైట్ల సతీష్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సుంకవల్లి గంగరాజు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దెబ్బకు వరితోపాటు పలు పంటలు దెబ్బతిన్నాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. మండపేట మండలం ఏడిదలో గురువారం తుఫాన్ దాటికి దెబ్బతిన్న వరిపొలాలను ఆయన స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక రైతులు పర్వతిన వీర వెంకట సత్యనారాయణ, పి.పెద్దకాపు, బత్తుల సూర్యనారాయణ, వైట్ల చిన్నబ్బు, గంధం రమేష్, గొల్ల సత్యనారాయణ తదితరులు వున్నారు.

కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది

మండపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట దెబ్బతిన్న రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మారేడుబాకలో గురువారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ధ్వంసమైన ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక రైతుల నుంచి పంటనష్టం వివరాలు తెలుసుకున్నారు. రైతులెవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట ఆలమూరు వ్యవసాయశాఖ ఏడి సీహెచ్‌కేవీ చౌదరి, మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్, స్థానిక కూటమి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు ప్రశంసనీయం: తుఫాన్ సమయంలో అన్ని శాఖల అధికారుల పనితీరు ప్రశంసనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ వల్ల వరితో పాటు ఉద్యాన పంటలు రహదారులు దెబ్బతిన్నాయన్నారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, పిల్లా తాతీలు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



ఆలమూరు మండలంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరిపంటలను పరిశీలిస్తున్న అధికారులు బృందం





కె.గంగవరం మండలం తామరపల్లిలో పడిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న బాలకృష్ణ. పక్క చిత్రంలో భట్లపాలికలో వరికంకులను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రిష్వంత్‌రాయ్



కొత్తపేటలో తుఫానుకు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి



రామచంద్రపురం మండలం చోడవరంలో నేలనంటిన వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



కపిలేశ్వరపురం మండలం అంగరలో పంట పొలాలను పరిశీలిస్తున్న కూటమి నాయకులు



రాయవరం మండలం లొల్లలో పంట పొలాలను పరిశీలిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో పురపాలక సంఘ సాధారణ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో పట్టణంలోని అన్ని వార్డులో సుమారు రూ.2.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదించిన పనులు ఆమోదించాలని కౌన్సిలరు అంకం శ్రీనివాస్ కోరారు. వైసీపీ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం జనసేన కౌన్సిలరు అంకం శ్రీనివాస్ పలు సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో రుడా ఫండ్స్ రూ.1.5 కోట్లతో మెయిన్ రోడ్డు మధ్య మొక్కలు పెంచేందుకు తీర్మానించారు. రూ.5 లక్షలు ఎయిర్ వాల్స్ ఏర్పాటుకు కేటాయిస్తూ తీర్మానించారు. డంపింగ్ యార్డులో మంటల కారణంగా పొగ రాకుండా రూ.3 లక్షలతో మోటారు పైపులైన్లు వేసేందుకు తీర్మానించారు. పట్టణంలో జలగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని నిర్మూలించాలని కౌన్సిలరు వి.సాయిప్రసాద్, వీసీ కొలమూరి శివాజీ కోరారు. సమగ్ర చెత్త నిర్వహణలో రూ.44 లక్షతో జేసీబీ కొనుగోలుకు ఆమోదం తెలిపారు. సాధారణ సమావేశంలో ప్రధాన ఎజెండాలో 16 అంశాలు ఆమోదించగా అత్యవసర సమావేశంలో 3 అంశాలు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రంగారావు

టిడ్కో రుణాలను లబ్ధిదారులకు
సత్వరమే బ్యాంకులు ఇవ్వాలి

మండపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గొల్లపుంత కాలనీలో వున్న టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారులకు సత్వరమే రుణాలను విడుదల చేయాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు బ్యాంకర్లను కోరారు. గురువారం ఆయన తన చాంబర్‌లో బ్యాంకర్లు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు సంబంధించి సిబిల్ స్కోరు తక్కువగా ఉందని రుణం ఇవ్వడం లేదని సిబిల్ స్కోరు బాగున్న వారిని గుర్తించి జాయింట్ అంకౌంట్ ద్వారా రుణం మంజురు చేయాలని కోరారు. త్వరితగతిన రుణాలు మంజూరు చేసి ప్రభుత్వానికి సహకరించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో బ్యాంకర్లతో పాటు మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

ఆత్రేయపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

రావులపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంగర శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో వెంకన్న జన్మనక్షత్ర పూజలు గురువారం జరిగాయి. ఆలయ అర్చకులు కె.బాలబాలాజి ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి అభిషేకాలు, పూజలు, స్వామివారి శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ఆలయ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఠంలో లక్ష బిల్వార్చన

రాయవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం కార్తీకశుద్ధ దశమిని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. గురువారం పీఠంలో మాట్లాడుతూ అమ్మవారి పాదముద్రలు వెలసిన రోజును పురస్కరించుకుని భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి మన్యసూక్త మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, విజయ వేంకటేశ్వరస్వామికి లక్ష తులసిపూజ, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పుష్పార్చనలు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్తీక సమారాధన జరుగుతుందన్నారు. భక్తులంతా పాల్గొనాలన్నారు.



జిల్లాస్థాయి చెస్ పోటీలకు రమ ఎంపిక

ఆత్రేయపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌స్థాయిలో జరిగిన అండర్-17 చెస్ పోటీల్లో ఆత్రేయపురం మండలం మెర్లపాలానికి చెందిన మెర్ల సత్యసాయి రమ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థి ఊబలంకలో పదో తరగతి చదువుతోంది. ఇటీవల కొత్తపేటలో డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించారు. కాకినాడలో జరగనున్న జిల్లాస్థాయి చెస్ పోటీల్లో రమా ప్రతిభ కనబర్చనుంది. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రమను హెచ్ఎం కిషోర్, డైరెక్టర్ రామకృష్ణ, పీఈటీ ప్రసాద్ మాస్టర్ బ్రహ్మాజీ, అభినందించారు.

రాజ్యాంగ దినోత్సవంపై పోటీలు

కె.గంగవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో విద్యార్థులతో అసెంబ్లీ - మీలో ఎవరు ఎమ్మెల్యే అనే అంశంపై వ్యాసరచన, వకృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 పాఠశాలల నుంచి 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పి.నవ్య(కోట), బి.క్రాంతి (సుందరపల్లి), పి.శశివర్ధని(దంగేరు) పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబరు 3న జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ దినోత్సవం జిల్లా కోఆర్డినేటర్ వీర బ్రహ్మానందం, డివిజనల్ కోఆర్డినేటర్ వైవీ రమణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జడ్పీ బొబ్బా జయశ్రీ గరల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసుపులేటి లక్ష్మీశ్రీవిద్య యోగా పోటీల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.ఉమ తెలిపారు. కొత్తపేట డివిజన్ స్థాయిలో జరిగిన యోగా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. పాఠశాల ఆవరణలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఎన్.ప్రసన్నకుమారి, కామవరపు మల్లికార్జునరావు తదితరులు అభినందించారు.

నవజనార్దన ఆలయాలకు ఉత్తరాంధ్ర భక్తుల రాక

ఆలమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలోనున్న నవజనార్దనస్వామి ఆలయాలను దర్శించుకోవడానికి ఉత్తరాంధ్ర భక్తులు గురువారం విచ్చేసి ఆయా ఆలయాలను సందర్శించి పూజలు జరిపారు. ఆలమూరు, జొన్నాడ, మడికి గ్రామాలలో ఉన్న నవజనార్దన ఆలయాలతో పాటు ధవలేశ్వరం, కపిలేశ్వరపురం, టేకి, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేట గ్రామాల్లో జనార్దనస్వామి ఆలయాలను సందర్శించుకున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయము, ఎయిమ్స్ కాలేజీ, ముమ్మిడివరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-533216

టెండరు ప్రకటన

Lr.No. No: Mktg.A8/Proc-Tarpaulins/KMS 2025-26 30-10-2025

ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా, అకాల వర్షాల వలన ధాన్యం తడవకుండా ఉండుటకు గాను అవసరమయ్యే 2100 టార్పాలిన్‌లు (GSM:250 (Grams per Square Meter) Sizes :24X18-1050 and 30X30-1050) కొనుగోలు కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

ఆసక్తిగల టెండరుదారులు www.apscscl.in లేదా www.neml.in వెబ్‌సైట్‌ను సందర్శించి టెండర్ పత్రాలను ఉచితంగా వీక్షించవచ్చు మరియు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

టెండర్‌లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు కస్టమర్ సర్వీస్ గ్రూప్‌ను ఫోన్ నెంబర్లు (+91-22)-48810500/9962059599/9032429420 లేదా ఇమెయిల్: askus@neml.in ద్వారా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్ టెండర్‌లను సమర్పించడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు ఫార్మాలిటీలను పూర్తి చేయడానికి చివరి తేది 06-11-2025 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుంది.

టెండరు షెడ్యూలు

1.	టెండరు ఫారము డౌన్‌లోడ్ ప్రారంభ తేది	తేది: 31-10-2025 నుండి
2.	టెండరు ఫారము డౌన్‌లోడ్ చివరి తేది/సమయము	తేది: 06-11-2025 సా॥5:00 వరకు
3	ఆక్షన్ తేది	తేది: 08-11-2025

సం/- సంయుక్త కలెక్టర్ మరియు వృత్తిరీత్యా కార్య నిర్వహణాధికారి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
డా.బి.ఆర్.అంబేద్కర్, కోనసీమ జిల్లా